https://epaper.dksaardyamlochaatimpu.com




డీకే సార్థ్యంలో
# చాటింపు
తెలంగాణ దిన పత్రిక

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 286 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | శుక్రవారం, ఆగస్టు,14, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

### సభలో తొలిసారి వందేమాతరం ఆరు చరణాల ఆలాపన..

## ముగిసిన వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 13: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గీతంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గీతాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గీతాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లు అయింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో సుస్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్య వ్యవస్థలో సంస్కరణలను డిమాండ్



చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన బాట పట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అలాగే భారీగా పోలీసులను మోహరించారు. ఈ యాత్రను సీజేపీ చేపట్టింది. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. వారిపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం చోటు చేసుకున్న వరుస పరిణామాల నేపథ్యం

## హిందూ, ముస్లింలు నా రెండు కళ్లు..

### కేవలం మాటల్లో కాదు చేతల్లో చూపించామన్న సీఎం రేవంత్..

**హైదరాబాద్,ఆగస్టు 13:** హైదరాబాద్ కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో 'మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్'లో పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ, ముస్లింలు తనకు రెండు కళ్ల లాంటివారని, మాటల్లో కాకుండా చేతల్లో సోనియా గాంధీ ఆ రీతిగా నిరూపించారని తెలిపారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేస్తూ, తెలంగాణలో అధికారంలోకి వస్తే ఆ రిజర్వేషన్లను తొలగిస్తామన్న అమిత్ షా సవాల్‌కు గుజరాత్‌లో ముందు తొలగించి చూపించాలని ఆరోపించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేస్తోందని, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల్లో మైనారిటీ యువత మెరుగైన స్థానాలను సాధించారని స్పష్టం చేశారు. గతంలో గ్రూప్ 1 ప్రశ్నపత్రాలు పల్లీ బఠానీల్లా అమ్ముడయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత లేని వారిని నియమించారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యూపీఎస్సీని అధ్యయనం చేసి రిటైర్డ్ డీజీపీని ఛైర్మన్‌గా నియమించామని చెప్పారు. అభ్యర్థుల ఉద్యోగాల నియామకాన్ని అడ్డుకోవడానికి కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, మంచి అడ్వకేట్లతో పోరాడి అభ్యర్థుల తరపున నిలబడి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మైనారిటీ సభ్యుడిని నియమించడమే కాకుండా, అజారుద్దీన్‌కు మంత్రి



పదవి, నిఖత్ జరీన్‌కు గ్రూప్ 1 ఉద్యోగంతో పాటు రూ. 3 కోట్ల బహుమతి, మహమ్మద్ సిరాజ్‌కు నిబంధనలు సవరించి డీఎస్పీ ఉద్యోగాన్ని అందించామని వెల్లడించారు.

## నాందేడ్‌లో సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై కత్తులతో దాడి..

నాందేడ్, ఆగస్టు 13: శిరోమణి అకాలీదళ్‌అ ధినేత, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై మహారాష్ట్రలోని నాందేడ్‌లో దాడి జరిగింది. గురుద్వారాను సందర్శించి వస్తుండగా నగర శివార్లలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి అనంతరం బాదల్‌ను నాందేడ్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ తన భార్య, అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, కుటుంబ సభ్యులతో కలిసి నాందేడ్‌లోని ప్రసిద్ధ 'తఖ్త్ శ్రీ హజూర్ సాహిబ్' గురుద్వారాను సందర్శించారు. దర్శనం ముగించుకుని వస్తుండగా ఈ దాడి జరిగింది. బాదల్ తోపాటు, భద్రతా సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాయి. దాడి వెనుక ఉన్న కారణాలు, దాడి చేసిన వారి సమాచారంపై పోలీసులు ప్రాథమిక విచారణ జరుపుతున్నారు.



## అభివృద్ధి కోసమే సీఎంకు మద్దతిచ్చా..

### పోచారం మరోసారి హాట్ కామెంట్స్

కామారెడ్డి, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా ఈరోజు(గురువారం) కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు.అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రికి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే..



చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

## అమెరికా కుట్ర? ఏకమౌతున్న ముస్లిం దేశాలు..!



**న్యూఢిల్లీ,ఆగస్టు 13:** ఒక రాత్రి ప్రపంచ పటం మీద కొన్ని గీతలు మెల్లగా కదిలాయి. మక్కా నగరంలో మూడు దేశాలు ఒకే గొడుగు కింద నిలబడ్డాయి. ఆ గొడుగు కింద డబ్బు ఉంది.. సైన్యం ఉంది.. ఆయుధాలు ఉన్నాయి.. అణుశక్తి ఉంది. కానీ ఆకాశంలో కనిపించని మరో విషయం ఉంది.. అదే భయం..! అమెరికా నీడలో దశాబ్దాలుగా నిద్రించిన మధ్యప్రాచ్యం.. ఇప్పుడు తనకంటూ ఒక కొత్త కవచాన్ని తయారు చేసుకుంటోందా? ఆ కవచం రేపు మరిన్ని దేశాలను తనలోకి లాగితే.. దాని నీడ ఎక్కడివరకు వెళ్తుంది? ఈ కథ మక్కాలో మొదలైంది కానీ దాని ప్రతిధ్వని భారత్ వరకు వినిపించే అవకాశం ఉందా? పాకిస్థాన్.. సౌదీ అరేబియా.. టర్కీ. మూడు దేశాలు. మూడు రకాల శక్తులు. సౌదీ దగ్గర అపారమైన ఆర్థిక బలం ఉంది. టర్కీ దగ్గర నాటో అనుభవంతో పెరిగిన సైనిక శక్తి, డ్రోన్లు, ఆయుధ తయారీ సామర్థ్యం ఉంది. పాకిస్థాన్ దగ్గర లక్షలాది సైనికులు.. వాటితో పాటు అణ్వాయుధ సామర్థ్యం ఉంది. ఈ మూడు శక్తులు ఒకే వలయంలోకి వచ్చినప్పుడు.. అది ఒక సాధారణ ఒప్పందంలా కనిపించినా, దాని వెనుక ఏర్పడే సమీకరణం మాత్రం చాలా పెద్దది. మక్కాలో కుదిరిన ఈ రక్షణ ఒప్పందం పరిధి ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. టర్కీ వైపు నుంచి ఇప్పటికే ఈ గొడుగు మరిన్ని దేశాలకు విస్తరించాలనే సంకేతాలు వచ్చాయి. మొదట ఈజిప్ట్ పేరు వినిపిస్తోంది. ఆ తర్వాత ఖతార్.. కువైట్.. జోర్డాన్.. అజర్‌బైజాన్.. సిరియా. ఒక్కో దేశం ఈ వలయంలోకి వస్తే.. మధ్యప్రాచ్య పటం మీద కొత్త సైనిక బంధం నెమ్మదిగా రూపం మార్చుకుంటుంది. ఇక్కడే ఈ కథలో అత్యంత భయపెట్టే విషయం దాగి ఉంది. ఈ ఒప్పందంలోని సూత్రం ప్రకారం.. ఒక సభ్యదేశంపై సాయుధ దాడి జరిగితే, అది మొత్తం కూటమిపై దాడిగా పరిగణించే విధానం ఉంటుంది. అంటే ఒక ప్రాంతంలో మొదలైన మంట.. మరో దేశ సరిహద్దు దాటడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. ఒక మిసైల్ ఒక దేశాన్ని తాకితే.. దాని ప్రతిస్పందన మరొక దేశం నుంచి రావచ్చు. ఆ తర్వాత ఇంకో దేశం కదలవచ్చు. ఇలా ఒక చిన్న చిచ్చు.. ఒక పెద్ద యుద్ధంగా మారే మార్గం అక్కడే మొదలవుతుంది. అయితే ఈ కూటమి పుట్టిన సమయం మరింత ఆసక్తికరం. ఇరాన్ దాడులతో మధ్యప్రాచ్యంలో అమెరికా భద్రతా వ్యవస్థపై ఉన్న నమ్మకానికి గట్టి దెబ్బ పడింది. అమెరికా రక్షణ వ్యవస్థలు ఎన్నో మిసైళ్లు, డ్రోన్లను అడ్డుకున్నా.. కొన్ని దాడులు సైనిక స్థావరాలు, ఇంధన కేంద్రాలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను తాకాయి. గల్ఫ్ దేశాలకు ఒక భయంకరమైన నిజం అర్థమైంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యం తమ పక్కన ఉన్నా.. యుద్ధం మొదలైతే దాని మంటల నుంచి పూర్తిగా తప్పించుకోవడం అంత సులభం కాదు.

## రాంచీలో అసెంబ్లీ ముట్టడికి యత్నం.. తీవ్ర ఉద్రిక్తత..

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ని ర్వహించిన పోటీ పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగాయంటూ ఆరోపిస్తూ రాంచీలో చేపట్టిన విద్యార్థుల ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తంగా మారడంతో... పోలీసులు ఏకంగా 600 మంది ఆందోళనకారులపై కేసులు నమోదు చేశారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, వివాదాస్పద పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు రాంచీలోని పాత అసెంబ్లీ భవనం నుంచి కొత్త అసెంబ్లీ భవనం వైపు మార్చ్ చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు విద్యార్థులు యత్నించడంతో తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆందోళనకారులను అడ్డుకోవడానికి పోలీసులు లాఠీఛార్జ్, వాటర్




క్యానన్లు, పదే పదే టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఈ ఘర్షణలో పలువురు విద్యార్థులతో పాటు భద్రతా సిబ్బందికి కూడా గాయాలయ్యాయి.

### మీరు చేయలేకపోతే మేమే చేస్తాం..

## లేబుల్స్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక..

**న్యూఢిల్లీ,ఆగస్టు 13:** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు ఆహార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం



వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొందిఅయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది.

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'

### రాజ్యసభలో రగడ

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని రామ్‌లీలా మైదాన్‌లో తాను పాల్గొన్న స్టేజ్‌ను బీజేపీ శుద్ధి చేసిన అంశాన్ని విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గేఇవాళ రాజ్యసభలో ప్రస్తావించారు. ఆ మైదానంలో ఓ కార్యక్రమంలో పాల్గొని ఖర్గే ప్రసంగించారు. అయితే ఆయన వెళ్లిన తర్వాత అక్కడ స్టేజ్‌ను శుద్ధి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశాన్ని రాజ్యసభలో ప్రస్తావిస్తూ.. అంటరానితనం చట్టం కింద వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హల్ద్‌వానిలో స్టేజ్‌ను శుద్ధీకరించిన వారిని శిక్షించాలన్నారు. వాళ్లను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా ఆ చర్యను ఖండించారని ఖర్గే తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఖర్గే మాట్లాడుతున్న సమయంలో సభలో గందరగోళం నెలకొన్నది. ఇలాంటి కార్యక్రమాలను బీజేపీ ప్రోత్సహించదు అని, ఆ ఘటన పట్ల దర్యాప్తు చేపడుతామని మంత్రి జేపీ నడ్డా అన్నారు.హల్ద్‌వానీలో తాను ప్రసంగం చేసిన స్టేజ్‌ను బీజేపీ సంబంధిత వ్యక్తులు శుద్ధి చేశారని ఖర్గే తన ప్రసంగంలో ఆరోపించారు. ఆ సభలో తాను కేవలం ప్రజల సమస్యల గురించి



మాత్రమే మాట్లాడానని, తానేమీ మతం గురించి కానీ, ఇతర అంశాల గురించి కానీ మాట్లాడలేదన్నారు. ఆ సభా ప్రాంగణంలో హవనం, శుద్ధి ప్రక్రియ నిర్వహించారని, ప్రజాస్వామ్యం ఇలాగే పనిచేస్తుందా, రాజ్యాంగాన్ని మీరు రక్షిస్తున్నారాన అని ఖర్గే ప్రశ్నించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయదలుచుకోలేదని, స్టేజ్‌ను శుద్ధి చేసి తనను అవమానించారని ఆయన అన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పంద్రాగస్టు వేడుక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష




నిజామాబాద్, ఆగస్టు 13 (డీ కే చాటింపు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 15న సంగారెడ్డిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుండగా, జిల్లా స్థాయిలో నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సలహాదారులు, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్దిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలని, ప్రోటోకాల్ ను అనుసరిస్తూ ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా గందరగోళానికి తావు లేకుండా ముందస్తుగానే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చక్కబెట్టుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు పురమాయించారు.

స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరపాలి

ఈ నెల 15న ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను, శకటాలను ఏర్పాటు చేయాలన్నారు. దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, అనధికారులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని అన్నారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లు సరి చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, సౌకర్యాలు కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య





మంచిర్యాల (డీకే చాటింపు),ఆగస్టు 12, 2026: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, తరగతి గదులు, భోజనశాల, వంటశాల, త్రాగునీటి వసతి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... పాఠశాలలో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, విద్యార్థులలో చదువుపై ఆసక్తిని పెంపొందించే విధంగా బోధనా పద్ధతులను అవలంబించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సకాలంలో అందించాలని, విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పాఠశాల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గానికి కేటాయించిన పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పాఠశాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అధికారులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సైకిళ్లు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మదాసి రమాదేవి బాల్య మిత్రురాలు ఎం.టి. రాజేశ్వరి సహకారంతో సుమారు 1 లక్ష 80 వేల రూపాయల విలువ గల సైకిళు ్లు, కుట్టుమిషన్ విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. బాలికల విద్యాభ్యాసానికి ఇటువంటి సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ, ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన,గ్రామసభ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.హాహాఈ కార్యక్రమాలలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా డి.సి.ఈ.బి. కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ మహా తిరంగా

# ర్యాలీలో పాల్గొన్న శ్రీరాములు అందెల

### దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వహించాలి - శ్రీరాములు అందెల




మహేశ్వరం, (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం (గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బాలాపూర్ డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బాలాపూర్ డివిజన్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో, నవతరంగ్ జూనియర్ కళాశాల సహకారంతో మహా తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు గారు మహా తిరంగా ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు, యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో మువ్వన్నెల జెండాలను పట్టుకుని దేశభక్తి నినాదాలతో బాలాపూర్ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపుతో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయ ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ గారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు నడికుడ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్, మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్ గౌడ్, చందావత్ రజిత శ్రీనివాస్ నాయక్, మంగపతి నాయక్, కళ్లెం మురళీధర్ రెడ్డి, యాదిరెడ్డి, క్యారగారి అరవింద్, బీజేవైఎం నాయకులు చైతన్య, వరికుప్పల కిరణ్ రాజ్, , నవారు రోహిత్ రెడ్డి, గడ్డం మధు, వినయ్, వరికుప్పల నరసింహా, కొంతం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహణ

### మాజి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా , జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ,



ఎల్బీనగర్, ఆగష్టు 13 (డీకే చాటింపు) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈరోజు చైతన్యపూరి డివిజన్‌లో 'హర్ ఘర్ తిరంగా' యాత్రను డివిజన్ అధ్యక్షులు నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిధులు గా స్థానిక మాజి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా , జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి , మాజి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ర్యాలీని ప్రారంభిం చారు.జాతీయ జెండా మన దేశ సమగ్రతకు , దేశ భక్తికి , దేశ ఐక్యతకు ప్రతీక. దేశ రక్షణకు స్ఫూర్తి అని ముఖ్య అతిధిలు తెలిపినారు . ప్రతి ఒక్కరు తమ ఇంటి పై జాతీయ జండా ను కట్టాలని తెలిపినారు . నాయకులు రుద్రారపు శంకర్ , వినోద్ యాదవ్ , కృష్ణ ప్రకాష్ , కులదీప్ జైన్, నరేందర్ రెడ్డి , కోట శ్రీదేవి , సుమన్ , ఉపేందర్ అన్న , శ్రీనివాస్ కృష్ణ, ఉలిపే శివ, అంజిబాబు , వేణు చారి,సాయితరుణ్ , సత్యం , కోలూరు నవీన్ , నితిన్ , జంపాల రాజు , రాజేష్ ,అర్జున్ , తిరుమల్ , ఉదయ్ , అనిత జైన్ ,అంజి , ప్రణీత , సత్య అక్క , జగన్ , కృప , అరుణ్ , అత్యధిక సంఖ్యలో స్కూల్ విద్యార్థులు , మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు .

# సర్వే నెంబర్ 255/1 లో గల మాదిగల భూములు మాదిగలకే కేటాయించాలి

### ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,ఆగష్టు (డీకే చాటింపు) సర్వే నెంబర్ 255/1 లో గల మాదిగల భూములు మాదిగలకే కేటాయించాలి:ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండల పరిధిలోని హన్మగల్ హయత్ నగర్ ముదిరాజ్ కాలనీ అనుకోని ఉన్న సర్వే నెంబర్255/1 లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల స్థలం ఉంది.అందులో రైతులు 56 ఎకరాల భూమిని వారి అవసరాలకు విక్రయించడం జరిగింది.ఇందులో మిగతా 18 ఎకరాల భూమి కొంతమంది కొంతభాగం రైతులు సాగు చేస్తుండగా కొంతభాగం రైతులు తమ అవసరాల కోసం విక్రయించారు. ప్రస్తుతం స్థలం ఖాళీగా కనిపించడంతో ప్రభుత్వం లాక్కోవడానికి ప్రయత్నిస్తుందన్న నేపద్యంలో పలువురు రైతులు మరియు కొనుగోలుదారులు కొన్ని రోజుల క్రితం సుధీర్ రెడ్డి గారిని కలవడం జరిగింది.దానిలో భాగంగా సుధీర్ రెడ్డి గారు ఈరోజు అట్టి ప్రదేశానికి చేరుకొని బాధిత రైతులు మరియు కొనుగోలుదారులతో మాట్లాడడం జరిగింది.ఇట్టి ప్రభుత్వంతో కొట్లాడైన సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గత బారాస పార్టీ ప్రభుత్వ హయంలో ఇట్టి రైతుల విషయంలో ప్రభుత్వంచే మాట్లాడి తగు న్యాయం చేయడం జరిగింది అని గుర్తు చేశారు.ప్రస్తుతం రైతులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు లేకుండా ఇట్టి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది అని అన్నారు.పేదల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని,బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సుధీర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.ఇట్టి కార్యక్రమంలో హయత్ నగర్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగౌని శ్రీధర్ గౌడ్,మల్లీశ్వరి రెడ్డి,ప్రదీప్,మధు,ఇంద్రకరణ్,మల్లేష్ రైతులు నగేష్,స్కైలాబ్,శ్రీరాములు, శ్యామ్,ప్రవీణ్, గంగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్‌పల్లి తండా - అయ్యవారిపల్లి లింక్ రోడ్డుకు మరమ్మతులు

**-రోడ్డు మరమ్మతు పనులకు పూజలు నిర్వహించి ప్రారంభించిన బోయిన్ పల్లి తాండ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్... -లింక్ రోడ్డుకు మరమ్మతులతో హర్షం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల ప్రజలు,వాహనదారులు, రైతులు... -బోయిన్ పల్లి తాండ సర్పంచ్ చొరవను ప్రశంసిస్తున్న ప్రజలు...**



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండా గ్రామ పంచాయతీ పరిధి నుంచి అయ్యవారి పల్లి గ్రామం వరకు ధ్వంసమైన లింక్ రోడ్డుకు చాలా రోజుల తర్వాత మంచి రోజులు వచ్చాయని చెప్పవచ్చు. బోయిన్ పల్లి తాండ గ్రామ సరిహద్దులో ఈ రోడ్డు మరమ్మత్తు పనులకు ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ గురువారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ రెండు గ్రామాలతో పాటు మాల్యా తాండ,నల్లగుట్ట తండాల మధ్య ఉన్న ఈ లింక్ రోడ్డు దయనీయంగా మారింది.ఈ లింక్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని ఆయా గ్రామాల ప్రజలు మొదటి నుంచి కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి తాండ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ ముందుకొచ్చి ప్రత్యేక పథకం నిధులతో ఈ రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టేందుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పనులు చేపట్టారు.పనులు ప్రారంభించిన వెంటనే మొరం వేసి రోడ్డును చదును చేశారు .ఈ వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు,రైతులకు, ఆయా గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను ఈ లింకు రోడ్డుకు ప్రత్యేకంగా మరమ్మతులు చేపట్టినట్లు సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు.చాలా రోజుల తర్వాత ఈ లింక్ రోడ్డుకు మంచి రోజులు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు,వాహనదారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మాల్యా తాండ, నల్లగుట్ట తండా గ్రామాల ప్రజలకు కాస్త మెరుగైన రావణా సౌకర్యం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు గౌడ్,అంత్వార్ సర్పంచ్ బి. రమణిక కృష్ణ,మాజీ సర్పంచ్ రమేష్,జెసిబి కృష్ణ,పిత్య నాయక్,కృష్ణ నాయక్,లైన్ మాన్ రమేష్,గోపాల్ నాయక్ ,రవి నాయక్,వెంకట్ నాయక్ ,ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



## తెలంగాణకు కేంద్రం ప్రశంసలు

# ఆర్కేవీవై అమలులో ఉత్తమ పురోగతి

### కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్- పాల్గొన్న రాష్ట్ర మంత్రి తుమ్మల



హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి(డీకే చాటింపు): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిపై 3 రాష్ట్రాలతో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆర్కేవీవై అమలులో ఉత్తమ పురోగతి సాధించిన తెలంగాణను కేంద్ర మంత్రి ప్రశంసించారు. ఈ పథకం రెండో విడత నిధుల మంజూరుకు సుముఖత వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న తీరును అభినందించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో పండించే పప్పు దినుసులను 100 శాతం కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేయగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. మొక్కజొన్న, ఇతర పంటల సేకరణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రిని కోరారు.

డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక

శుక్రవారం, ఆగస్టు,14, 2026

# భారత జాతీయోద్యమ పితామహుడు బాలగంగాధర తిలక్

బాలగంగాధర తిలక్ స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో–వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3–డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజపత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్–బాల్–పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లోలక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు.అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించా రు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం.

విలేకరులు కావలెను

రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన

డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక

డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# జై జవాన్ జై కిసాన్ నినాదాలతో మారుమోగిన తిలక్ గార్డెన్ ప్రాంగణం



నిజామాబాద్ విలేకరి ఆగస్టు 13 (డీ కే చాటింపు): నిజామాబాద్ నగరంలో గురువారం టిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిలక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్, యోగ అసోసియేషన్ సభ్యుల సహకారంతో నలుగురు సైనికులకు రైతులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. భారతదేశ రక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విశేష కృషి చేసిన వీర జవాన్ లు , నల్ల ప్రవీణ్, ఏసిపి హవల్దార్. అంరాద్, సాయినేని కమలాకర్ ఎం ఏ సి పి , హవిల్దార్, మెట్పల్లి, బాణాత్ నరేష్ ,హవీల్దర్, మామిడిపల్లి., సిహెచ్. లక్ష్మీపతి ,జే సి ఓ, జన్నెపల్లి, ఈ నలుగురు వీర జవాన్లు. రైతు రాజన్న అమరాద్ ను ఘనంగా సన్మానించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధన్పాల్ శ్రీనివాస్ గుప్తా పట్టణ అధ్యక్షులు. గౌరవ అతిథులుగా డాక్టర్ ముక్క వినోద్ కుమార్ గుప్తా, సూరి సిద్దయ్య సెక్రటరీ స్నేహ సొసైటీ, తులా గంగాధర్ అధ్యక్షులు వాకర్స్ అసోసియేషన్,. ప్రత్యేక ఆహ్వానితులుగా నిజామాబాద్ జిల్లా విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సూర హర ప్రసాద్, పార్సి విజయకుమార్ గుప్తా, డాక్టర్ పి .బీ. కృష్ణమూర్తి, ఎర్రం ప్రభాకర్ హాజరైనారు. గౌరవ అతిథులుగా కొండ వీరేందర్, పూర్ణచందర్రావు , ఆదర్శ సైనికుడు, రైతు చిరవేణి నవీన్ కుమార్ వడ్డేపల్లి, హాజరైనారు. సైనికులు రైతుల సేవలు అభినందనీయమని వీరిని గౌరవించాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని ముఖ్య అతిథిగా హాజరైన ధనపాల్ శ్రీనివాస్ గుప్త తెలిపారు. వాకర్స్ గ్రూపు సభ్యులు ముంతాజ్, లాయక్, అఖిలాకు బై, కుసురు బై, మహమ్మద్ అత్తరుద్దీన్, అక్బర్ భాయ్, ఉమర్, హష్మీ, అక్తరుద్దీన్, సైనికులకు ప్రత్యేకంగా సన్మానించినారు. తిలకి గార్డెన్ యోగ గ్రూప్ సభ్యులు, గజవాడ ధర్మరాజు ,చిదుర రాజు,బోస్ బాబు ,భాషెట్టి విశ్వనాథం, ఎం. యాదగిరి, బి .గంగాధర్, తొడుపునూరి విశ్వనాథం, గంగిశెట్టి, పెంటయ్య,తదితరులు హాజరైనారు. సోషల్ వర్కర్ గిరిధర్, చల్ల గంగాధర్ పాల్గొన్నారు టిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం మాట్లాడుతూ ఇంతవరకు 103 మంది సైనికులను, రైతులను సన్మానించుకోవడం జరిగిందని ఇది నిరంతర ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని ఈ రకంగా అవకాశం ఇస్తున్న వారికి సహకరిస్తున్న వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.జాతీయ గీతం జన గణ మన తో కార్యక్రమం ముగిసింది.

## హర్ ఘర్ తిరంగా అభియాన్

# ఘనంగా తిరంగా ర్యాలీ



ఎల్బీనగర్ నగర్, ఆగస్టు 13, డీకే చాటింపు:– ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్లో భాగంగా నాగోల్ డివిజన్ పరిధిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సేవా స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ ఎల్‌బీ నగర్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి, భారత్ మాతాకీ జై, వందే మాతరం వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. యువత, మహిళలు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా కాదని, అది భారతదేశ గౌరవానికి, స్వాతంత్ర్యానికి, త్యాగానికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశ సరిహద్దుల్లో నిరంతరం సేవలందిస్తున్న వీర జవాన్ల త్యాగాలను ప్రతి భారతీయుడు ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశం తన సామర్థ్యాన్ని మరింత బలంగా చాటుకుంటోందని, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యాల దిశగా దేశం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను ప్రతి కుటుంబానికి చేరువ చేయాలని, యువతలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించాలని అన్నారు. త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయడంతో పాటు, దాని విలువలను మన జీవితాల్లో ఆచరించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. మన దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా "దేశం ముందు -- మనమంతా ఒక్కటే" అనే భావనతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, బిజెవైఎం నాయకులు, విద్యార్థులు, యువత, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ స్కూల్ సందర్శించి విద్యార్థుల కు ఆంగ్ల పాఠం బోధించిన ఇంచార్జి కలెక్టర్



నిజామాబాద్ ఆగస్టు 13(డీ కే చాటింపు): బోధన్ డివిజన్ ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయాన్ని, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలను ఇంచార్జ్ కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ లను ను సందర్శించి, విద్యార్థినులకు ఆంగ్లం సబ్జెక్ట్ లో పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని ,ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో స్థిరపడాలని , విద్యార్థిను లకు ప్రేరణ కల్పించారు. పాఠశాలల పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. కేజీబీవీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతోకూడిన క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలల్లో భోజన నాణ్యతను తనిఖీ చేసి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని, పాఠశాలల ప్రవేశ మార్గంలో ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కేజీబీవీ లో బాలికల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే విషయమై సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడతానని అన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ఉండడాన్ని గమనించిన కలెక్టర్, జిల్లా వ్యాప్తంగా గల అన్ని కేజీబీవీలలో ఆర్.ఓ ప్లాంట్లు, సోలార్ హీటర్లు వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో వరి ధాన్యం, ఇతర కూరగాయలను సాగు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు. బాలికల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక, రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

# మహిళసంఘంభవనం ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ సలహాదారు బాన్సువాడఎమ్మెల్యేపోచారం శ్రీనివాస రెడ్డి






నిజామాబాద్ ఆగస్ట్ 13(డీ కే చాటింపు): వర్ని మండలంలోని జాకోర, శంకోరా గ్రామాలలో మహిళా సంఘం భవనం, గ్రామ పంచాయతీ భవనం ,సొసైటీ దుకాణ సముదాయం భవనాలను ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం ప్రారంభించారు. జాకోర గ్రామంలో ఎస్ డి ఎఫ్ నిధుల ద్వారా 10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించారు.జాకోర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంఆధ్వర్యంలో నూతనంగా నిర్మించినదుకాణ సముదాయం మరియుప్రహరీ గోడను ప్రారంభించారు. శంకోర గ్రామంలో 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. బోధన్ ఆర్ డీఓ విజయకుమారి ,ఎంపీడీవో వెంకటేష్, ఎమ్మార్వో, సర్పంచులు హరిలాల్, సాయిలు, సొసైటీ చైర్మన్ దశరథ్ , వర్ని మండల ప్రజాప్రతి నిధులు,నాయకులు, అధికారులు మహిళ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ సోమేశ్వర ఆలయంలో శ్రావణమాసం తొలిరోజు పూజలు

## - భక్తి శ్రద్ధలతో శ్రావణమాసం పూజలు



జనగామ/పాలకుర్తి ఆగస్టు 13 డికేచాటింపు జిల్లా ప్రతినిధి కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి రోజు గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి గణపతి పూజ,ఏకాదశ రుద్రాభిషేకంతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, మత్తగజ నాగరాజు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# టీ ఎం ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరంగ జండాలు పంపిణీ



నిజామాబాద్ ఆగస్ట్ 13(డీ కే చాటింపు):ప్రధానమంత్రి పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా లో భాగంగా 100 మందికి జాతీయ జెండాలను టీ ఎం ఆర్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేయడం జరిగింది ప్రెసిడెంట్ తాటి వీరేశం తెలిపారు.ప్రతి ఒక్కరూ దేశ స్వాతంత్రానికి పోరాడిన స్వాతంత్ర సమరయోధులను జ్ఞాపకం చేసుకుంటూ దేశాన్ని కాపాడుతున్న వీర సైనికులకు జేజేలు పలికారు. ఇట్టి కార్యక్రమం లో రిటైర్డ్ సైనికులు ,పుర ప్రముకులు,డాక్టర్లు పాల్గొన్నారు.

# ఈ శ్రమ పోర్టల్లో హమాలీ కార్మికుల పేర్లునమోదు చేయాలి




నిజామాబాద్ ఆగస్ట్ 13(డీ కే చాటింపు): ఈ శ్రమ పోర్టల్ లో హమాలీ కార్మికుల పేర్లు నమోదు చేసి, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నే సాబ్ స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చారు. ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం రుద్రూర్ మండల సమీకృత సముదాయముల భవనం ఎదుట ఆందోళన చేపట్టి, తహసీల్దార్ తారాబాయి కు వినతి పత్రం అందజేశారు. 55 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులందరికీ 6వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 120 గజాల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు భీమయ్య, మహబూబ్, లక్ష్మణ్, సాయిలు, పీరయ్య, గంగాధర్, కిరణ్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ వైబ్ వెబ్‌తో ప్రపంచమే కుగ్రామం!

ప్రపంచ మానవాళి అంతర్జాలంతో అనుసంధానం అయ్యింది. 1989లో కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్–లీ విప్లవాత్మకమైన "వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ)"ను ప్రతిపాదించడం, ఆగష్టు 1991లో ప్రజలకు అందుబాటులోకి రావడం, 1993 నుంచి ఉచితంగా యాక్సెస్ చేయవచ్చని వెల్లడించడం ఓ అద్భుత అంశం. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ రాకతో ప్రపంచం మన చేతి వేళ్ల దరికి చేరింది. అపారమైన జ్ఞానం మన ముంగిట నిలిచింది.కేవలం ఒక్క క్లిక్‌తో కావలసిన సమాచారం మన కళ్ల ముందు ప్రత్యక్షం అవుతున్నది. మానవాళిని అనుసంధానించే ఇంటర్నెట్, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ పోషిస్తున్న పాత్ర అనన్యసామాన్యం. సోషల్ మీడియా వేదికలు, సమాచార సేకరణ, నైపుణ్య వికాసం, వినోద పరిశ్రమ, ఈ–వ్యాపారాలు, హైపర్ టెక్స్ట్, గ్రాఫిక్స్, ఆడియో వీడియో, మల్టీ మీడియా, ఆన్‌లైన్ అద్భుతాలు లాంటి ప్రయోజనాలు సుసాధ్యం కావడానికి డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ పాత్ర అద్వితీయం. ఈ అత్యాధునిక ఆవిష్కరణను ప్రచారం చేయడానికి, వెబ్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏటా 01 ఆగష్టున అధికారికంగా "ప్రపంచ వరల్డ్ వైడ్ వెబ్ దినోత్సవం" లేదా "ప్రపంచ వెబ్ దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ వెబ్ దినోత్సవం–2026 ఇతివృత్తంగా "ఎనర్జీ–అవేర్ వెబ్ అండ్ ఏఐ సిస్టమ్స్ ఫర్ సస్టేనబులిటీ" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ ఆవిష్కరణతో ప్రపంచ మానవాళికి సమాచార వితరణ, వాణిజ్యం, జ్ఞాన సమపార్జన లాంటివి చాలా తేలిక అయిపోయాయి. 1991 - 2004 మధ్య వెబ్ 1.0 వర్షన్ ఉండడం, నేడు వెబ్ 2.0 వర్షన్ వాడుకలో ఉన్నది. ఆధునిక మానవుడు వెబ్, అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి.

# పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

## -నారాయణపేటలో ఎస్‌ఎఫ్ఐ చలో కలెక్టరేట్... -తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేత...



నారాయణపేట,(డీకే చాటింపు): విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం తగదని,ఫీజులు చెల్లించలేక చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవు ఎస్ఎఫ్ఐ నారాయణపేట జిల్లా కమిటీ హెచ్చరించింది.రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన రూ.10,814 కోట్ల పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నారాయణపేటలో చేపట్టిన 'చలో కలెక్టరేట్'ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది.జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది విద్యార్థులు తరలివచ్చి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, రాష్ట్ర కమిటీ నాయకుడు నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం గత కొన్ని ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద,మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు.కళాశాలల యజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి తెస్తుండటంతో అనేక మంది విద్యార్థులు చదువులను మధ్యలోనే ఆపేసే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ప్రధాన డిమాండ్లు

పెండింగ్‌లో ఉన్న రూ. 10,814 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ఏకకాలంలో విడుదల చేయాలి.హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీల బకాయిలను తక్షణమే చెల్లించాలి.ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు విడుదల చేయకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తరపున నారాయణపేట తాహసిల్దార్ అమరేందర్ కృష్ణకు ఓ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా నాయకులు, మండల బాధ్యులు,వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్త కోర్సులకు అనుగుణంగా విద్యార్థులలో మార్పు రావాలి

## టీకేఆర్ కళాశాల ఓరియంట్ టేషన్ డే కార్యక్రమంలో

## కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి







మహేశ్వరం, ఆగస్టు 13 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్లో జరిగిన టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఓరియంటేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ మహేశ్వరం మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి,కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన విద్యార్థులంతా ఇంటర్ పూర్తవగానే ఇంజనీరింగ్ చేయటం సామాన్యమైన విషయం కాదు ప్రస్తుత కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులపై విద్యార్థులకు అవగాహన పెంచుకొని ప్రస్తుతం నడుస్తున్న ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పోటీపడేలాగా విద్యార్థులు ముందుకు సాగాలని తీగల కృష్ణారెడ్డి కోరారు విద్యార్థిని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి స్నేహితంతో మీ తల్లిదండ్రులకు కళాశాలకు పేరు తీసుకురావాలని ఈ కళాశాల ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసి ఇప్పటికే అనేక మంది మంచి ఉన్నత స్థాయిలో స్థిరపడడం జరిగినది ఇంజనీరింగ్ పూర్తి అవగానే ఉద్యోగం తో పరిశోధన రంగాలపై కూడా పట్టు సాధిస్తే దేశ విదేశాల్లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ హరినాథ్ రెడ్డి ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డిప్రిన్సిపల్స్ రామస్వామి రెడ్డి మురళీమోహన్ హెచ్ వో డి లు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## -బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర కీలకం... -బాల్య వివాహాలకు సహకరించకుండా స్పష్టంగా 'నో'చెప్పాలి... -సమాచారం అందిస్తే తక్షణ చర్యలు... -నారాయణపేట జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక... -బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు... -జిల్లా ఎస్పీ వినీత్... -బాల్య వివాహాల నిర్మూలనపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పూజారులు,పాస్టర్లు, ఖ్వాజీలకు అవగాహన కార్యక్రమం...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి. హెచ్.ప్రియాంక పిలుపునిచ్చారు.శ్రావణ మాసంలో వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని పూజారులు,పాస్టర్లు, ఖ్వాజీలకు బాల్య వివాహాల నిర్మూలనపై నారాయణపేట మండలం సింగారం స్టేజీ వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత మాత్రమే కాకుండా చట్టవిరుద్ధమైన చర్య అని స్పష్టం చేశారు.18ఏళ్లు నిండని బాలికకు వివాహం చేయడం వల్ల ఆమె విద్య, ఆరోగ్యం,భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు.మత పెద్దల పాత్ర కీలకం పూజారులు,మౌలానాలు, పాస్టర్లు,ఖాజీలు వివాహ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని,సమాజంలో వారి మాటకు ఎంతో గౌరవం, విశ్వాసం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.బాల్య వివాహం నిర్వహించేందుకు ఎవరైనా సంప్రదించినప్పుడు, వివాహానికి అనుమతి ఇవ్వకుండా "ఇది సరైన వయసు కాదు..వివాహాన్ని వాయిదా వేయండి"అని స్పష్టంగా చెప్పాలని కోరారు. మక్తల్,కొడంగల్,కోస్గి తదితర ప్రాంతాల్లో బాల్య వివాహాల నివారణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కారణాలు చూపడం సమర్థనీయం కాదు కుటుంబ ఒత్తిడి,ప్రేమ వ్యవహారం,సామాజిక పరిస్థితులు తదితర కారణాలను బాల్య వివాహాలకు చూపుతున్నప్పటికీ,ఏ కారణం కూడా చట్టాన్ని ఉల్లంఘించడానికి సమర్థన కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. బాల్య వివాహాలతో బాలికలు చిన్న వయసులోనే గర్భధారణ,రక్తహీనత,ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.చదువు మధ్యలోనే ఆగిపోయి భవిష్యత్తులో విద్య,ఉపాధి అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.ఇటీవల కోటకొండ పీహెచ్‌సీ సందర్శన సందర్భంగా కవలలకు గర్భవతిగా ఉన్న యువతిని గుర్తించి,తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న ఆమెకు వెంటనే వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు.బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల వారి విద్య, ఉపాధి,ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ అన్నారు."ఒక బాలికకు బాల్యం కావాలి..చదువు కావాలి..ఆరోగ్యం కావాలి.. తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కావాలి"అని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వాలి

జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత తహసీల్దార్,సీడీపీఓ లేదా చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.వయస్సు ధృవీకరణ పత్రాలు,ఆధార్ తదితర వివరాలపై అనుమానాలు ఉన్నప్పుడు వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు.

బాల్య వివాహాల విషయంలో ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చినా,ఎలాంటి రాజకీయ లేదా ఇతర జోక్యాలకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.శ్రావణ మాసంలో జిల్లాలో జరిగే వివాహాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,సీడీపీఓల ద్వారా వివాహాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అనుమానాస్పద సందర్భాల్లో తక్షణమే పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.

బాల్య వివాహాలకు స్వస్తి

"బాల్య వివాహాలకు స్వస్తి– బాలికల భవిష్యత్తుకు భరోసా–బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లా" అనే లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు."బాలికకు మంచి విద్య అందాలి..మంచి ఉద్యోగం రావాలి..తన కాళ్లపై తాను నిలబడాలి..అదే మనందరి ఆశీర్వాదం కావాలి"అని పేర్కొన్నారు.అనంతరం బాల్య వివాహాలకల్పిస్తున్న నిర్మూలనకు అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను ఎస్పీతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్,డీపీఆర్ఓ రషీద్,డీసీపీఓ కరిష్మా, చైల్డ్‌లైన్ తిరుపతయ్య, సీడీపీఓలు,అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

# 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'కి శ్రీకారం

## - సచివాలయంలో ప్రారంభించిన మంత్రి పొన్నం- 119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల మందికి ఇవ్వనున్న ప్రభుత్వం- ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ





హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి(డీకే చాటింపు): బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి ఆర్థిక వృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని ఆయన గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

1.19 లక్షల మందికి ప్రయోజనం

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం లక్షా 19 వేల మందికి ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు కాగా లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో విస్తరణ కుట్టు మిషన్లు కోరుకునే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, తొలి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి చెప్పారు. భవిష్యత్‌లో ఈ పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

మహిళల ఉపాధికి ప్రభుత్వం అండ

మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతోపాటు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు తదితర కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీనవర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కుల గణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి

హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ రోజు సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్‌గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్‌ను ''మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్''గా, సచివాలయాన్ని "డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం"గా పేరు మార్చినట్లు తెలిపారు. ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ల చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి సమాజానికి దేవాలయాలు మార్గదర్శకంగా నిలవాలి

## -జాగృతి అభ్యుదయ సంఘం పర్యావరణ హిత వస్తువుల పంపిణీలో ఎమ్ ఎమ్ సి హయత్ నగర్ ఉప కమిషనర్ అజ్మీరా స్వామి.



ఎల్బీనగర్ ఆగస్టు 13 (డీకే చాటింపు) 1)శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానం కమిటీకి, బి.ఎన్.రెడ్డి నగర్ 2) శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీకి, పద్మావతి కాలని 3) శ్రీ షిరిడీ సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ కమిటీ, ప్రశాంతి నగర్ గార్లకు క్యాన్సర్ కారక ప్లాస్టిక్ ప్లేట్లకు ప్రత్యామ్నాయంగా ఆరోగ్యం/పర్యావరణహితమైన స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ గ్లాసులు, జ్యూట్ బ్యాగ్ లు, మొక్కలు ఉచిత పంపిణీ... జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ కార్యాలయం ఇఇ వెంకట నర్సు గారి ప్రత్యేక చొరవతో, ఆదాని గ్రూప్ వారి ఆర్థిక సహకారంతో ఒక్కో దేవాలయానికి భక్తుల ఆరోగ్యం, పుడమితల్లి పరిరక్షణ నిమిత్తం 98 స్టీల్ ప్లేట్లు 98 స్టీల్ క్లాసులు 45 జూట్ బ్యాగులు చొప్పున ఉచితంగా అందచేయడం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హయత్నగర్ సర్కిల్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప కమిషనర్ శ్రీ అజ్మీర స్వామి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో దేవాలయాలు భక్తులకు మార్గదర్శకంగా, స్ఫూర్తిదాయకంగా ఉండాలని అన్నారు. నేల కాలుష్యం, పరిసరాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిందని, ప్రజా శ్రేయస్సు కొరకు ప్రభుత్వం చేసే చట్టాలను గౌరవించి ప్రజలు సహకరించాలని అన్నారు. ప్రజారోగ్యానికి హానిచేసే కాలుష్య కారక ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా తిరిగి వాడుకునే వస్తువులను వాడాలని ప్రోత్సహిస్తూ ఉచితంగా వాటిని ఇస్తూ ఆచరణాత్మకంగా ముందడుగు వేసి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం ప్రయత్నాలను అభినందించారు. పాడైపోయిన దేవీదేవతల పటాలను భక్తులు ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా జాగ్రత్తగా తొలగించేందుకు "ఉద్వాసన" నూతన కార్యక్రమం వీవీజ రూపొందించి ఏజెన్సీ ద్వారా వివిధ దేవాలయాల్లో అందుబాటులోకి తెచ్చామని, ఈ సౌకర్యాన్ని భక్తులు వినియోగించుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడి మానవాళికి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని రాబోయే క్యాన్సర్ లాంటి విపత్కరమైనటువంటి రుగ్మతల నుంచి సమాజాన్ని కాపాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఒక్కో దేవాలయానికి షుమారు 20వేల రూ.ల విలువైన వస్తువులు ఇచ్చిన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఉద్దేశ్యాలను తమ దేవాలయంలో అమలు పరుస్తూ ముందుకు తీసికెళ్ళి భక్తుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంచుతామని శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థాన కమిటీ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటి, శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల ప్రతినిధులు మాట్లాడుతూ దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా, సమాజానికి సేవ చేసే కేంద్రాలుగా కూడా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమాల్లో... దేవాలయాల ప్రతినిధులు బూడిది వివేకానంద రెడ్డి, సి. మంగపతి రావు, ఎం. రాజి రెడ్డి, చంద్రశేఖర్, కుమారస్వామి, నారాయణ, రామకృష్ణ, రవీందర్, రమేష్, సాంబశివరావు, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరరావు, ఇ.శ్రీరాములు గౌడ్, ఎ.సత్యనారాయణ, రఘునాథ్ యాదవ్, గాయకులు కె.వి.రమణయ్య, తాతయ్య, అల్లూరయ్య శెట్టి, ఓబులేష్ యాదవ్, భ్రమరాంబ, రఘురాములు, నాగమణి, రవీందర్, పూజారులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.



# వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే..

## ఆ 35 కూడళ్లలో సరికొత్తగా



**విశాఖపట్టణం,** : వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 11 కూడళ్లు ఎంపిక చేస్తారు.. ఆ తర్వాత మరో 24 కూడళ్లకు పనులను విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా



**నెల్లూరు,** : ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

**విజయవాడ,** : వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి.ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు.జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా



**కాకినాడ,** : వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పధ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థు ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు.పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు.దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వామ్యులను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన



**విజయవాడ,** : రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ ప్రక్షాళన అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక ప్రభుత్వం కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకుల మధ్య జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పనితీరుపై స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ వ్యాఖ్యలను భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ మార్పులకు సంకేతాలుగా పలువురు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలను అత్యంత కీలకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఆయన సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు చేరకపోతే ఆశించిన రాజకీయ ఫలితాలు రావని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా కొన్ని శాఖల్లో నిర్ణయాల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం కనిపించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం తగ్గడం వంటి అంశాలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాఖలపై పూర్తి పట్టు సాధించి ఫలితాలు చూపించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రతి అంశంలో ముఖ్యమంత్రి జోక్యం అవసరం లేకుండా ఆయా శాఖల మంత్రులే ముందుండి పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల బాధ్యతల విషయంలో కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచడం, అంతర్గత విభేదాలను తగ్గించడం, స్థానిక స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంపై తన దృష్టికి ఫిర్యాదులు వచ్చినట్లు కూడా ఆయన ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.స్థానిక ఎన్నికల్లో కూటమి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం ప్రతి మంత్రి క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల తర్వాత మంత్రుల పనితీరును సమగ్రంగా సమీక్షించి అవసరమైతే కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇప్పటివరకు మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళనపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ ఇటీవల జరిగిన సమీక్షలు, సీఎం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పనితీరుకు ప్రాధాన్యం పెరగనున్నదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల అనంతరం రాజకీయ పరిస్థితులు ఎలా మారుతాయనే అంశాన్ని బట్టి కేబినెట్‌లో మార్పులపై స్పష్టత వచ్చే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశమే రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్,

## డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన




**విజయవాడ,** : ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని.. ఆందోళనకు గురికావద్దని సూచించారు.మరోవైపు 2025 డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడుసార్లు వివరణ ఇచ్చామని.. అయినా కూడా దుష్ప్రచారం చేస్తుంటే మరోసారి క్లారిటీ ఇస్తున్నట్లు వివరించారు. హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే అర్హులకే పోస్టులు దక్కాయన్న తమీమ్ అన్సారియా.. ఏవైనా అనుమానాలు ఉంటే తమ వద్దకు రావాలని సూచించారు. 12 పద్ధతులను అనుసరించి డీఎస్సీ నిర్వహించామని.. డీఎస్సీ మెరిట్, సెలక్షన్ లిస్టును ఆన్ లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తమీమ్ అన్సారియా తెలిపారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు.. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మకుండా వచ్చే డీఎస్సీపై దృష్టిపెట్టాలని తమీమ్ అన్సారియా సూచించారు.మరోవైపు స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకాలపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి స్పందించారు. అన్ని ఫెడరేషన్లు, స్పోర్ట్స్ అసోసియేషన్లు నుంచి పూర్తి వివరాలు సేకరించామని, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని వివరించారు. ఆ తర్వాతే ప్రిలిమినరీ ప్రాధాన్యత జాబితాను రూపొందించి విద్యాశాఖకు పంపినట్లు భరణి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టింది

# అనంతపురం పాలిటిక్స్ హీట్..
# జేసీ వర్సెస్ కేతిరెడ్డి

**అనంతపురం,** : అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.ఒకే లొకేషన్‌లో అటు ప్రతిపక్ష వైసీపీ నిరసన దీక్ష, ఇటు అధికార టీడీపీ కీలక నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం ఒకేసారి జరగనుండటంతో పెద్దవడుగూరులో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల క్యాడర్ భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో భారీగా పోలీసు బలగాలను మోహరించి నిఘా పెట్టారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న అక్రమాల ఆరోపణలను తిప్పికొట్టేలా టీడీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో



తాడిపత్రి పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి.రాజకీయంగా ఎప్పుడూ సెన్సేషనల్ గా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల తాజా కదలికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నిరసన దీక్షకు పోలీసులు అనుమతి ఇస్తారా, లేదా అనే ఉత్కంఠ నడుస్తుండగానే ఇరు వర్గాలు సవాల్ ప్రతిసవాళ్లకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఒకే చోట జరుగుతున్న ఈ రెండు భిన్నమైన పొలిటికల్ యాక్టివిటీస్ రాబోయే గంటల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు ఇరు పార్టీల ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు స్థానిక వర్గాల నుండి సమాచారం అందుతోంది.

# ఐఏఎస్ ల బదిలీలు




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ (ఎయా)లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్‌స్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్‌గా ఎం. శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలి ని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది.ఆమ్రపాలికి నో పోస్టింగ్ సీనియర్ ఐఏఎస్ అమ్రపాలికి పోస్టింగ్ లేని బదిలీ చేసింది ఏపీ ప్రభుత్వం. ఐఏఎస్ అధికారిణి కాట ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్ లో విధులు నిర్వహించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఏపీలో విధుల్లో చేరినప్పటి నుంచి ఆమె విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, సుదీర్ఘకాలంగా సెలవుల్లోనే ఉండటం సర్వీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మూడు నెలలుగా ఆమె వరుస సెలవుల్లోనే కొనసాగుతుండటంతో, ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఆమెను పర్యాటక శాఖ నుంచి బదిలీ చేస్తూ సాధారణ పరిపాలనా శాఖ లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.విభజన చట్టం ప్రకారం ఐఏఎస్‌ల కేటాయింపు ప్రక్రియలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆమెను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, తన స్వస్థలం హైదరాబాద్ అని, కాబట్టి తెలంగాణలోనే కొనసాగేలా మినహాయింపు ఇవ్వాలని ఆమె కేంద్రంతో పాటు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయపోరాటం చేసినప్పటికీ చివరకు ఊరట లభించకపోవడంతో, కేంద్ర ఉత్తర్వులకు లోబడి ఆమె అనివార్య పరిస్థితిల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాల్సి వచ్చింది. కానీ, విధుల్లో చేరిన మొదటి రోజు నుంచే ఆమె పాలనపై పెద్దగా దృష్టి సారించకపోవడమే కాకుండా ఎక్కువ సమయం సెలవులకే మొగ్గు చూపారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన కాలంలో ఆమ్రపాలికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎండీఏ వంటి కీలకమైన పోస్టింగ్‌లు దక్కాయి. విశాలమైన అధికారాలు, మెట్రోపాలిటన్ పరిధిలోని పెద్ద పెద్ద ప్రాజెక్టులను నిర్వహించిన అనుభవం ఉన్న ఆమెకు.. ఏపీలో పర్యాటక శాఖ బాధ్యతలు కేటాయించారు. అయితే, ఏపీ ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఆమె పలుమార్లు తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వెళ్లేందుకు తీవ్రస్థాయిలోనే ప్రయత్నాలు సాగించారు. కానీ, అందుకు సంబంధించిన మార్గాలు మూసుకుపోవడంతో ఆమె మానసికంగా ఏపీలో సేవలు అందించడానికి సిద్ధంగా లేరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఒక వైపు రాష్ట్రంలో కీలకమైన శాఖల నిర్వహణకు సమర్థులైన అధికారుల అవసరం ఎంతో ఉంది. ఇటువంటి సమయంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వరుసగా సెలవుల్లో ఉండటం, కేటాయించిన స్థానంలో నిబద్ధతతో పనిచేయకపోవడం పట్ల సచివాలయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఆమెను జీఏడీకి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. తదుపరి ఆమె ఏ రకమైన నిర్ణయం తీసుకుంటారు, మళ్లీ సుదీర్ఘ సెలవు పై వెళ్తారా లేక ఏపీలోనే మళ్లీ సీరియస్‌గా పని చేసేందుకు సిద్ధమవుతారా అన్నది తేలాల్సి ఉంది.

# మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు
# ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా



**ఒంగోలు** : స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు.ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు

# 51 జాబ్ క్యాలెండర్ రెడీ ...



నెల్లూరు, : రాష్ట్రంలో త్వరలోనే మెగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ప్రకటించారు. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని, సున్నా స్థానాలకే పరిమితం కావాల్సి ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. శనివారం నెల్లూరులో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, ఆ పార్టీ నేతలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. ఉన్నత న్యాయస్థానాలు హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నందుకా లోకేశ్ రాజీనామా చేయాలని కోరుతున్నారని ఆయన ప్రశ్నించారు.ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం ప్రాజెక్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ధర్నాలకు దిగుతోందని నారాయణ ఆరోపించారు. ఆ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, 'మావిగన్' అంటూ చేస్తున్న రాద్ధాంతాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.ల

# న్యాయం చేయకపోతే సూసైడ్...
# జీవితాన్ని మార్చేసినా ఒక్క పోస్ట్...

తిరుపతి, : సోషల్ మీడియాలో నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ పెట్టినందుకు తనను కిడ్నాప్ చేసి భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అనుచరులు కిడ్నాప్ చేసి చితకబాదారని రాజంపేటకు చెందిన మణి అనే బాధితుడు ప్రెస్‌మీట్ పెట్టాడు. నేటి ఈ కేసులో తనకు న్యాయం జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోతే జగన్ ఇంటి ముందే ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. బాధితుడు పత్తిమణి తెలిపిన వివరాలు ప్రకారం 2023 జూన్11న ఈ ఘటన జరిగింది. అప్పట్లో అధికార పార్టీలో ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. నారా లోకేష్, పవన్ కల్యాణ్‌ను తిరుపతిలో అడుగు పెట్టనివ్వబోమని వార్నింగ్ ఇచ్చారు. దీనికి స్పందించిన రాజంపేటకు చెందిన పత్తిమణి... రియాక్ట్ అయ్యాడు. ఇది రాచరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడికైనా వెళ్లవచ్చు. అని కామెంట్ చేశాడు. ఈ చిన్న వ్యాఖ్యే జీవితాన్ని మార్చేసిందని అంటున్నారు. రాజంపేటలోని ఓ హోటల్‌లో టీ తాగుతున్న తనను భూమన అనుచరులు సుమారు 14 మంది మాటువేసి పట్టుకున్నారని చెప్పాడు. కళ్లల్లో కారం కొట్టి, ఇనుప రాడ్లతో విచక్షణారితంగా చితకబాది, కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని వివరించాడు. 2023 జూన్ 11 ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3 గంటల మధ్య జరిగినట్టు బాధితుడు చెబుతున్నాడు. తనను తీసుకెళ్లి ఓబులవారిపల్లి ప్రాంతానికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. కేవలం రాజకీయ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకే ఈ దాడి జరిగినట్టు బాధితుడు పేర్కొన్నారు. " మా గురించి కామెంట్ పెట్టడానికి నీకు ఎంత ధైర్యం' అంటూ కులం పేరుతో దూషిస్తూ తన ప్రాణాలు తీయడానికి ప్రయత్నించారని పత్తిమణి ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నాప్ చేసిన తర్వాత నిందితులు భూమన కరుణాకర్ రెడ్డికి వీడియో కాల్ చేశారని, ఆ కాల్‌లో పత్తిమణి రక్తసిక్తమైన స్థితిని చూపించారని బాధితుడు వివరించాడు. ' వీడి నాలుక కదా మాట్లాడింది, ఆ నాలుక



కోసేయండి, చంపేసి శేషాచలం అడవుల్లో పడేయండి" అని భూమన కరుణాకర్ రెడ్డి ఆదేశించినట్టు మణి ఆరోపించారు. వారు చేసిన దాడిలో తన ముక్కు పూర్తిగా దెబ్బతిందని, ప్రస్తుతం ముక్కుతో గాలి పీల్చుకోలే స్థితిలో ఉన్నానని, ఐదు నిమిషాలు మాట్లాడితే ఆయాసం వస్తుందని, కన్ను కూడా దెబ్బతిన ఆపరేషన్ చేయంచుకున్నానని ఆయన తెలిపారు. బాధితుడు చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో ఉంటే, అప్పటి రాజంపేట డీఎస్పీ చైతన్య నిందితులను సహకరించారని మణి ఆరోపించారు. నిందితులపై బలహీనమైన సెక్షన్లు పెట్టి 41ం నోటీసులతో వదిలేశారని, పైగా బాధితుడైన తనపైనే రిటర్న్ కేసులు పెట్టించారని ఆయన వాపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ తనకు ఇంకా బెదిరింపులు వస్తున్నాయని మణి ఆవేదన వ్యక్తం చేశారు. కేసు ఉపసంహరించుకోవాలని, లేదంటే చంపేస్తాని సుధాకర్, చైతన్య యాదవ్ వంటి వారు తన ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 2023 నాటి కిడ్నాప్ కేసును తిరిగి ఓపెన్ చేసి పునర్విచారణ చేయాలని డిమాండ్ చేశారు. భూమన కరుణాకర్‌రెడ్డి, భూమన అభినయ్ రెడ్డిని ఏ1,ఏ2గా చేర్చాలని వెంటనే అరెస్టు చేయాలన్నారు. తనకు, తన కుటుంబానికి ప్రాణ రక్షణ కావాలని వేడుకున్నారు. న్యాయం జరగని పక్షంలో రెండు నెలల తర్వాత తాడేపల్లిలోని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంటి ముందు తన కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు.

# మండలి కోసం వడపోతలు షురూ



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

# 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు




**హైదరాబాద్,** : తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

# ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ వార్



**హైదరాబాద్,** : రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# కేబినెట్ ప్రక్షాళన కు లైన్ క్లియర్



**హైదరాబాద్,** : తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేబినెట్ కొలువుదీరలేదు. రెండు స్థానాలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వీటిని ఎప్పుడు భర్తీ చేస్తారా.. అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై అడుగులు ముందుకు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా క్యాబినెట్‌ను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఒక సురక్షితమైన మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అసంతృప్తులకు తావివ్వకుండా, కేవలం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను మాత్రమే భర్తీ చేసి ప్రస్తుతానికి రాజకీయాన్ని చల్లబరిచేందుకు ఏఐసీసీ సిద్ధమైంది. వారం, పది రోజుల్లో, అంటే ఈ నెల 14వ తేదీ తర్వాత చిన్నపాటి విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.జులైలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగి రాష్ట్రంలోని పలువురు మంత్రులతో వరుసగా వ్యక్తిగత సమావేశాలు నిర్వహించారు. శాఖల పనితీరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, నాయకుల మధ్య సమన్వయం, వివిధ పోర్ట్‌ఫోలియోలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఆమె ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధిష్టానం, ప్రస్తుత దశలో సమూల మార్పులు చేపడితే ఎదురయ్యే ముప్పును ముందే ఊహించింది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రుల రాజీనామాలు, తొలగింపుల వల్ల ఉత్పన్నమైన రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి అలజడులకు ఆస్కారం ఇవ్వకూడదని నిర్ణయానికొచ్చింది.హైకమాండ్ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి రెండు కీలక సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఒకటి గిరిజన సామాజిక వర్గానికి, మరొక దాన్ని ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం లేని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఎస్టీ (లంబాడా) రేసులో గిరిజన సామాజిక వర్గానికి చెందిన రామచంద్ర నాయక్, బాలు నాయక్ లేదా దేవరకొండ ఎమ్మెల్యే పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక రెడ్డి సామాజిక వర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్లు తమ శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా చర్చల్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందే తనకు క్యాబినెట్‌లో చోటు కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన వర్గీయులు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుత విస్తరణలో భారీగా పోర్ట్‌ఫోలియోలు మారుతాయా లేదా అనే అంశం పక్కన పెడితే, కొన్ని కీలక శాఖల్లో చిన్నపాటి మార్పులు ఉండే అవకాశం ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, మంత్రిపదవులు ఆశిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పదవులు దక్కని వారి నుంచి ఎలాంటి ప్రతిఘటన లేదా బహిరంగ అసంతృప్తి రాకుండా చూడటమే రేవంత్ రెడ్డికి, హైకమాండ్‌కు ఉన్న అతిపెద్ద సవాలు. ఇందుకోసం తుది ప్రకటనకు ముందే ఆశావాహులతో వ్యక్తిగతంగా చర్చలు జరిపి, వారికి ఇతర నామినేటెడ్ లేదా పార్టీ పదవుల హామీలతో బుజ్జగించే వ్యూహాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది.మొత్తానికి, పెద్ద ఎత్తున రీషఫుల్ చేసి లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం కంటే, రెండు ఖాళీలను భర్తీ చేస్తూ సామాజిక సమతుల్యతను కాపాడుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందని భావిస్తున్నారు. ఈ నెల 14 తర్వాత వచ్చే ఆ కీలక ప్రకటనతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

# వివాదాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే



**అదిలాబాద్,** : కొన్ని పత్రికల్లో ప్రచురితమైన అవినీతి , అక్రమాల కథనాలను మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిత్వ హననానికి, రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గానీ తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. ఇసుక, భూముల వ్యాపారాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య కథనాలు రాస్తున్న వ్యక్తులు, సంబంధిత పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.ప్రధానంగా ప్రచారంలో ఉన్న రూ. 450 కోట్ల బ్యాంక్ రుణాల వ్యవహారంపై ఎమ్మెల్యే పక్కా ఆధారాలతో క్లారిటీ ఇచ్చారు. 2009-10 కాలంలో సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, అవి తాను సొంతంగా సృష్టించిన పత్రాలు కావని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ ద్వారా వినియోగించిన మొత్తం నిధులు రూ. 109 కోట్ల 11 లక్షలు మాత్రమేనని, అన్ని బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని ఎన్‌పీఏ గా గుర్తించాయని వివరించారు. ఒకవేళ రూ. 450 కోట్ల మేర మోసమే జరిగి ఉంటే బ్యాంకులు కేవలం రూ. 109 కోట్లకు ఆస్తులను ఎలా వేలం వేస్తాయని ఆయన ప్రశ్నించారు.రుణ చెల్లింపులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, 2014 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంకులకు ఇప్పటికే రూ. 44 కోట్ల 81 లక్షలు చెల్లించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆంధ్ర బ్యాంక్ ఖాతా ఎన్‌పీఏగా మారిన తర్వాత కూడా మరో రూ. 18 కోట్ల 72 లక్షలు చెల్లించామని, 2024 అక్టోబర్ 31 నుంచి నిరంతరంగా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. వ్యాపారంలో ఎదురైన ఒడుదొడుకులను ప్రస్తావిస్తూ.. యూఎస్ ట్రేడింగ్ మార్కెట్ తీవ్ర పతనం కావడం వల్ల తాను వ్యక్తిగతంగా రూ. 160 కోట్ల మేర భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, అయినప్పటికీ బాధ్యతాయుతంగా బ్యాంకు బకాయిలను తీరుస్తున్నట్లు చెప్పారు.తన సామాజిక, ప్రజా సేవలను గుర్తుచేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా సొంత నిధులతో 15 పాఠశాలలను నిర్మించి విద్యారంగానికి సహాయపడ్డానని ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న నాయకులు ధైర్యముంటే ఎక్కడైనా బహిరంగ చర్చకు రావాలని, తాను పూర్తి ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై నిజానిర్ధారణ కమిటీ వేసినా, కమిటీ ముందుకు వచ్చి అన్ని పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించేందుకు తాను వెనుకాడేది లేదని ప్రకటించారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణలో తన పేరు మంత్రి పదవి రేసులోకి వచ్చిన ప్రతిసారీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు స్వపక్ష, విపక్ష నేతలు కావాలనే ఇటువంటి కుట్రలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు. గత పదేళ్లపాటు తీవ్ర ప్రతికూల పరిస్థితులలో, ప్రతిపక్షంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పోరాడిన తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ రాజకీయ కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారుల జాతకాలు బయటపడతాయని, నిజా నిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ప్రకటించారు.

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...




**న్యూఢిల్లీ,** : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్ట్‌ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# భారత్, ఫ్రాన్స్ రఫేల్ డీల్



**న్యూఢిల్లీ,** : భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత?ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

# కేవలం రెండు ఆకులు చాలుభూమిపై దొరికే సంజీవని ఇదే



ఇంటి పెరట్లో ఈ మొక్క కచ్చితంగా మొక్కలలో వాము కూడా ఒకటి. చిన్న పిల్లలు ఉన్నవాళ్లు ఈ వాము మొక్కలు పెంచితే ఎన్నో సమస్యల నుంచి సులభంగా బయటపడతారు. ఇక వాము గింజలను మీ వంటకాలతో పాటు అనేక పానీయాలు తయారీలో కూడా వీటిని ఉపయోగిస్తారు. ఇంటి పెరట్లో ఈ మొక్క కచ్చితంగా మొక్కలలో వాము కూడా ఒకటి. చిన్న పిల్లలు ఉన్నవాళ్లు ఈ వాము మొక్కలు పెంచితే ఎన్నో సమస్యల నుంచి సులభంగా బయటపడతారు. ఇక వాము గింజలను మీ వంటకాలతో పాటు అనేక పానీయాలు తయారీలో కూడా వీటిని ఉపయోగిస్తారు.

చిన్న పిల్లలకు ఏది తిన్నా కూడా సరిగా అరగదు అలాంటి వాళ్ళకి ఈ వాము ఆకు గొప్ప ఔషధం. ఈ వాము ఆకు రసంలో కొద్దిగా తేనె కలిపి మీ పిల్లలకు తాగిస్తే ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. ఇంకా దగ్గు, ఇన్ఫెక్షన్స్ వంటి వాటికీ కూడా ఇది చెక్ పెడుతుంది. ఈ వాము ఆకు నీరు మంచి నేచురల్ మెడిసిన్ అని చెప్పాలి. ఇంకా కాలిన గాయాలు, మచ్చలను కూడా ఈ వాము తగ్గేలా హెల్ప్ చేస్తుంది. ఇంకా దీనిలో యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. ఇది గాయాలను త్వరగా తగ్గించడానికి సహాయపడుతుంది. ఈ ఆకులు తలనొప్పిని కూడా తగ్గిస్తాయి. ఇంకా ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఈ రసాన్ని తీసి తలకు రాస్తే తలనొప్పి తగ్గుతుంది.

## శక్తివంతమైన ఈ పానీయం తీసుకుంటే..



### నడవలేని వాళ్ళు కూడా పరుగులు పెడతారు

శక్తివంతమైన ఈ పానీయం మీరు రోజూ తీసుకుంటే వయస్సు పై బడి నడవలేని వాళ్ళు కూడా పరుగులు పెడతారు. అయితే మీరు దీనిని ఉదయం ఖాళీ కడుపుతో కానీ రాత్రి భోజనం చేసిన తర్వాత గోరువెచ్చగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. శక్తివంతమైన ఈ పానీయం మీరు రోజూ తీసుకుంటే వయస్సు పై బడి నడవలేని వాళ్ళు కూడా పరుగులు పెడతారు. అయితే మీరు దీనిని ఉదయం ఖాళీ కడుపుతో కానీ రాత్రి భోజనం చేసిన తర్వాత గోరువెచ్చగా తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. దీనిని ఎలా తయారు చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం. ఆరోగ్యకరమైన దాల్చిన చెక్క పానీయానికి కావాల్సిన పదార్థాలు : రెండు గ్లాసులు నీరు, మూడు నల్ల యాలకులు, ఒక దాల్చిన చెక్క, 5 నుంచి 6 లవంగాలు, ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసంను తీసుకోవాలి. దీనిని మీరు సరైన కొలతలతో చేసి తాగితే అన్ని వేళలా ఆరోగ్యంగా ఉంటారు.

ఆరోగ్యకరమైన దాల్చిన చెక్క పానీయం తయారీ విధానం : ముందుగా ఒక పాత్రలో రెండు గ్లాసుల నీరు పోయాలి. ఆ తర్వాత దీనిలో నల్ల యాలకులను కూడా వేసి ఈ నీటిలో వేయాలి. ఇంకా దీనిలో దాల్చిన చెక్క, నాలుగు లవంగాలు కూడా వేయాలి. ఇలా వేసిన తర్వాత మంటపై కనీసం 10 నిమిషాల పాటు బాగా మరిగించాలి. ఆరోగ్యకరమైన దాల్చిన చెక్క పానీయం తయారీ విధానం : అయితే మీరు దీనిలో ఒక గ్లాస్ నీళ్లు పోసి మరిగిస్తే తాగడానికి రుచిగా ఉంటుంది.

ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి 10 నిమిషాల పాటు మూతపెట్టి పక్కన పెట్టాలి. ఇక కొద్దీ సేపటి తర్వాత వడకట్టి వీటిని గోరువెచ్చగా తాగాలి. ఆరోగ్యకరమైన దాల్చిన చెక్క పానీయానికి కావాల్సిన పదార్థాలు : రెండు గ్లాసులు నీరు, మూడు నల్ల యాలకులు, ఒక దాల్చిన చెక్క, 5 నుంచి 6 లవంగాలు, ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసంను తీసుకోవాలి. దీనిని మీరు సరైన కొలతలతో చేసి తాగితే అన్ని వేళలా ఆరోగ్యంగా ఉంటారు. అయితే ఇంకా టేస్ట్ కావాలంటే తేనె కలుపుకుని దీనిని తాగొచ్చు.

## ప్రతి రోజు ఒక స్పూన్ తింటే....
## అరికాళ్ల మంటలు పూర్తిగా పోతాయ్

ఏన్నో ఏళ్ళ నుంచి ఇబ్బంది పడుతున్న అరికాళ్ల మంటలు తగ్గాలంటే ఇవి తింటే చాలు. ఆరోగ్యాన్ని పెంచే వాటిలో ఇవి కూడా ఒకటి. అయితే ఈ తెల్లవి మనం వంటల్లో మాత్రమే ఉపయోగిస్తారు. కానీ, నల్లవి కూడా మంచివి. ఇవి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి.

ఎందుకంటే, దీనిలో శరీరానికి ఉపయోగపడే పోషకాలు అన్నీ ఉంటాయి. మెదడు ఆరోగ్యం: నువ్వులు రోజ తినడం వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. ఇంకా మెదడునులోని కండరాలను, కణాలను మంచిగా ఉంచుతుంది.

ఇంకా రక్త ప్రసరణ సరిగ్గా జరుగుతుంది. మతిమరుపును కూడా పూర్తిగా తగ్గించి జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. అలాగే, నాడీ వ్యవస్థ పని తీరు కూడా మెరుగుపడుతుంది. ఇమ్యూనిటీని చిటికెలో పెంచుతుంది:

నువ్వుల్లో ఒకటి కాదు రెండు కాదు అనేక పోషకాలు ఉంటాయి. ఇంకా వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో ఇమ్యూనిటీ పెరిగి బలంగా తయారవుతారు. ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినా వాటిని తట్టుకునే శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా ఎలాంటి రోగాలు రానివ్వకుండా చేస్తుంది. ఈజీగా వీటితో బరువు తగ్గించుకోవచ్చు : నువ్వులతో చేసిన ఈ ఫుడ్స్ తినడం వల అధిక బరువు సమస్య నుంచి కూడా బయటపడతారు. ఇంకా



ఊబకాయం సమస్య నుంచి కూడా బయట పడొచ్చు. ఎందుకంటే దీనిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నువ్వులతో చేసిన ఫుడ్స్ తినడం అలవాటు చేసుకోండి. చెడుకు కొవ్వును తగ్గించుకోవచ్చు : నువ్వులను రోజూ తీసుకుంటే చెడుకు కొవ్వును తగ్గించుకోవచ్చు. కొద్దీ రోజుల్లోనే కొవ్వును కరుగుతుంది. బయట ఫుడ్స్ వల్ల బాడీలో చెడు కొవ్వు అనేది పేరుకుపోతుంది. దీని వలన షుగర్, బీపీ, గుండె సమస్యలు వంటివి రావచ్చు. కాబట్టి, చెడు కొవ్వును వీలైనంత వరకు కరిగించుకోవడం అవసరం.

## ఇవి గుప్పెడు తింటే చాలు..
## శరీరంలో బిగ్ మిరాకిల్ చూస్తారు




రోజు రోజుకు మారుతున్న మనిషి అలవాట్లలో ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడమే మానేశారు. ఇలాంటి సమయంలో ఈ ఫుడ్స్ తీసుకుంటే చాలు. అలాంటి ఆహారాలలో, వాల్‌నట్ కూడా ఒకటి. ఇంకా దీనిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. రోజు రోజుకు మారుతున్న మనిషి అలవాట్లలో ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడమే మానేశారు. ఇలాంటి సమయంలో ఈ ఫుడ్స్ తీసుకుంటే చాలు. అలాంటి ఆహారాలలో, వాల్‌నట్ కూడా ఒకటి. ఇంకా దీనిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, మెగ్నీషియం, ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి మంచిది: ఈ వాల్‌నట్స్‌లో శరీరానికి కావాల్సిన పోషకాలు ఎన్నో ఉన్నాయి. ఇంకా దీనిలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీఆక్సిడెంట్లు గుండె పనితీరుకు కూడా హెల్ప్ చేస్తాయి.

## అందులో నటించడం అదృష్టంగా భావిస్తున్నా: సిమ్రాన్



సీనియర్ నటి సిమ్రాన్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. గత ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆమె, ప్రస్తుతం సూపర్‌స్టార్ రజినీకాంత్ సరసన 'ధర్మన్' అనే ప్రతిష్టాత్మక చిత్రంలో కీలక పాత్రలో నటించబోతున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లపై లోకనాయకుడు కమల్ హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాగా, ఇటీవల విడుదలైన రజినీకాంత్ ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిమ్రాన్ ఈ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా కోసం చిత్ర బృందం మొత్తం ఎంతో కష్టపడి పనిచేస్తోందని, వచ్చే నెల నుంచి తాను కూడా షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు వెల్లడించారు. ఇది ఖచ్చితంగా ఒక సూపర్ హిట్ కాంబినేషన్ అవుతుందని, సినిమాపై తనకు 100 శాతం నమ్మకం ఉందని చెప్పారు. సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో మళ్లీ కలిసి పనిచేసే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని, తాను ఆయనకు వీరాభిమానినని తెలిపారు. ఆయన ఏమాత్రం అహంకారం, ఈగో లేని అత్యంత నిరాడంబరమైన వ్యక్తి అని, తన జీవితంలో ఆయన ఒక ఆదర్శప్రాయుడిగా నిలుస్తారని ప్రశంసలు కురిపించారు. అలాగే లెజెండరీ యాక్టర్ కమల్ హాసన్ నిర్మాణంలో పనిచేయడం ఈ అవకాశాన్ని మరింత ప్రత్యేకంగా మార్చిందని సిమ్రాన్ ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రజినీకాంత్‌తో కలిసి చేసిన 'పేట' చిత్రం కేవలం ఒక టీజర్ లాంటిదని, ఆయనతో మరింత ఎక్కువసేపు పనిచేయాలనే తన కోరిక ఇప్పుడు నెరవేరిందని చెప్పారు.

## అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్....



హర్రర్-యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై మంచి స్పందనతో పాటు సానుకూల సమీక్షలు అందుకున్న ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో తెలుగు, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. తెలుగు, కన్నడ భాషల్లో దాదాపు 300 థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. విడుదలైన తొలి రోజు నుంచే హర్రర్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమాకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. సినీ వెబ్‌సైట్లలోనూ, ఐఎండీబీలోనూ మంచి రేటింగ్‌లు, పాజిటివ్ రివ్యూలు సొంతం చేసుకుంది. టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌పై హారర్, థ్రిల్లర్, యాక్షన్ అంశాలను వినూత్నంగా మిళితం చేస్తూ రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి,

రాగిణి ద్వివేది ప్రధాన పాత్రలు పోషించారు. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించగా, క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. వరలక్ష్మి శరత్‌కుమార్ తన కెరీర్‌లోనే తొలిసారిగా చేసిన ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రా క్షన్‌గా నిలిచింది. దానికి తోడు నవీన్ చంద్ర యాక్టింగ్ కూడా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ చిత్రంలో 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను హర్రర్ థ్రిల్లర్ రూపంలో దర్శకుడు సంజీవ్ మేగోటి ఆవిష్కరించారు. హర్రర్, మిస్టరీ, యాక్షన్ అంశాలను సమతుల్యం గా మేళవిస్తూ ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా తీర్చిదిద్దారు. ముఖ్యంగా సూపర్ స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించిన కృష్ణసాయి నటించిన ప్రత్యేక గీతం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూఢనమ్మకాల నేపథ్యంలో కర్మ సిద్ధాంతాన్ని థ్రిల్లింగ్ కథనంతో చూపించిన ఈ సినిమా హర్రర్, యాక్షన్, థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు థియేటర్లలోనే కాదు ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్‌నూ అదే స్థాయిలో అలరిస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తంచేశారు.

## నా ముఖం ఎవడూ పగలగొట్టలేదంటూ పోస్ట్




టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతి బాబు ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించకపోయినప్పటికీ, ఆయన చేతిలో ప్రస్తుతం వరుస ఆఫర్లు ఉన్నాయి. శ్రీశ్రీ, న్యూటన్స్ థర్డ్ లా, సలార్-2, సంబరాల ఏటిగట్టు వంటి పలు భారీ ప్రాజెక్టుల షూటింగ్‌లతో ఆయన ఎంతో బిజీగా గడుపుతున్నారు. సినిమా తీరిక లేని షెడ్యూళ్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, జగపతి బాబు సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన పర్సనల్ విశేషాలను, సరదా వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు.

అప్పుడప్పుడు తనకు ఇష్టమైన వంటలు చేస్తూ అలరించే ఆయన, తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో ఒక డిఫరెంట్ కుకింగ్ వీడియోను పోస్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈసారి ఆయన ఇంట్లోనే స్వయంగా కుకీస్ తయారు చేసి సందడి చేశారు. ఈ బిస్కెట్ల తయారీ విధానాన్ని తన పెద్ద కుమార్తెను చూసి కాపీ కొట్టానని తనదైన మార్క్ హ్యూమర్‌తో ఒక ఫన్నీ క్యాప్షన్ కూడా జత చేశారు. అయితే ఈ వీడియోలో జగపతి బాబు కనిపించిన లుక్ చూసి నెటిజన్లు, ఆయన అభిమానులు కాస్త ఆందోళనకు గురయ్యారు. ఆయన ముఖం ఎవరో తీవ్రంగా కొట్టినట్లుగా, కళ్ల కింద నల్లగా మారడంతో అసలు ఆయనకు ఏమైందంటూ సోషల్ మీడియాలో ఆరా తీయడం మొదలుపెట్టారు. దీనిపై వెంటనే స్పందించిన జగ్గూ భాయ్ తనదైన శైలిలో క్లారిటీ ఇచ్చారు. తన ముఖం చూస్తే ఎవడో పగలగొట్టినట్లు అనిపిస్తోందని, కానీ తనను ఎవరూ కొట్టలేదని, ఇటీవల తాను చిన్న సర్జరీ చేయించుకోవడం వల్లే ముఖం ఇలా అయిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తను బాగానే ఉన్నానని చెప్పడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చర్చకు దారితీస్తోంది.

## 'లక్కీ భాస్కర్ 2' అప్పుడే మొదలవుతుంది

టాలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా, మమితా బైజు హీరోయిన్‌గా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వెంకీ అట్లూరి, తన తదుపరి ప్రాజెక్టులు మరియు 'లక్కీ భాస్కర్ 2'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కిన 'లక్కీ భాస్కర్' చిత్రం ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో తాజా ఇంటర్వ్యూలో ఆయనకు 'లక్కీ భాస్కర్ 2' గురించి ప్రశ్న ఎదురైంది. దానికి స్పందించిన వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. 'లక్కీ భాస్కర్' మంచి విజయాన్ని అందుకుంది. దానికి సీక్వెల్ తీస్తే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉంటాయి. నాకు కూడా ఆ సినిమాకు సీక్వెల్ చేయాలనే ఆసక్తి ఉంది. అయితే అద్భుతమైన కథ సిద్ధమైన



తర్వాతే ఆ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాను. అంతకుముందు మరో రెండు సినిమాలు చేయాలనుకుంటున్నాను. ధనుష్ హీరోగా ఓ సినిమా ఇప్పటికే ఖరారైంది. ఆ సినిమా పూర్తయ్యాక 'హోమ్ అలోన్' తరహాలో ఓ చిత్రం చేయాలని అనుకుంటున్నాను.

## హీరోగా కంటే యాంటీ హీరో రోల్స్ బాగుంటాయి

ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా వరుస విజయాలు అందుకున్న టాలీవుడ్ సీనియర్ నటుడు శ్రీకాంత్.. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా మెప్పిస్తూనే మరోవైపు ప్రధాన పాత్రల్లోనూ సందడి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవలే 'మిస్టర్ మిడిల్ క్లాస్' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఈయన తాజాగా 'ఆబ్జెక్షన్ మై లార్డ్' అంటూ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇందులో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈయన.. సినిమా జర్నీకి సంబంధించిన విషయాలు పంచుకున్నారు. 'కెరీర్ తొలినాళ్లలో విలన్‌గా ఎంట్రీ ఇచ్చి.. ఆ తర్వాత లవర్ బాయ్‌గా, ఫ్యామిలీ హీరోగా ఎదిగాను. ఇప్పుడు నా కొడుకు రోషన్ హీరోగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడంతో నేను పూర్తిగా విలన్, క్యారెక్టర్ రోల్స్ వైపు ఫోకస్ పెట్టాను. మనం అద్దంలో చూసుకున్న తర్వాత మన పరిమితులు ఏంటో మనకు తెలిస్తే లైఫ్‌ను ఎంతో హ్యాపీగా ఎంజాయ్ చేయొచ్చు. హీరోగా రేసులో ఉండటం కంటే విభిన్నమైన పాత్రలు, యాంటీ హీరో రోల్స్ చేయడం చాలా సరదాగా ఉంటుంది..

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com